నిజమయిన కల

శ్రీ కలపటపు రామగోపాలరావు

★

అంతా విని పక్కున నవ్వేసింది పార్వతి!

సమయం, నాలుగో ఝాము రాత్రి. స్థలం, గుమాస్తా గురునాథం నెలకి నలభైరూపాయలచొప్పున అద్దెకు సంపాదించిన గదిలో పడకభాగం. విషయం, అంతక్రితమే అతడికొచ్చిన కల—

అతివుత్సాహంగా లేచి కాళ్లు కడుక్కుని కూచున్నాడు, మళ్లీ పడుకుంటే ఫలితం దక్కదని. అప్పటికి, పక్కమీద పార్వతి కదలడం గమనించి, ధైర్యంచేసి మెల్లిగా తట్టి లేపాడు.

"నిజంగా ఎంత బాగుందనుకున్నావా పట్టుచీర!—"

"పట్టుచీరా? ఏం పట్టుచీర?" అని లేచికూచుంది పార్వతి.

అయినా, కొంత వుపోద్ఘాతం వుంటేనేగాని అసలు గ్రంథానికి విలవుండదని—

"అదే, నువ్వు కట్టుకున్న బనారసు పట్టుచీర!" అని కొంటెనవ్వొకటి విసిరాడు.

"చాల్లెద్దురూ, మీ హాస్యాలూ మీరూను! అర్ధరాత్రివేళ అంకమ్మ శివాలని యిందుకేనా యేమిటి ప్రత్యేకంగా పనిగట్టుకు లేపారు? పన్నెండేళ్లనించి కాపురం చేస్తుంటే, పట్టుమని శుభ్రమైనవి నాలుగు కట్టుడుచీరలైనా కొనిపెట్టలేకపోయారుగాని, పట్టుచీరకూడాను యీ మొహానికి? ఏదో, పక్కయింటావిడ కొనుక్కుందంటే, పోనీ సంవత్సరాదిపండగ వస్తోందని, నోరు చేసుకొని అడిగాను. ఎల్లాగూ మీవల్ల కానప్పుడే ఎత్తిపొడుపులుకూడా ఎందుకు పైగాను?"

"అబ్బా, ఎత్తిపొడుపు కాదే! నిజంగా నాకళ్ళతో నేను చూశానంటుంటే! సరిగ్గా ఆ వెంకుబాయమ్మ చీరలాగే నెమిలిపింఛంరంగూ ఆవేళ నువ్వు 'కన్నాటుప్లేసు' దుకాణంలో బొమ్మనిచూసి విస్తుపోయావే, అల్లాంటిదే పమిటంచూ, జరీపోచలూను! పైగా, అంతా ఏదో వెన్నెల పులిమినట్టు మడతమడతకీ మిసమిసలాడిపోతూ వుంది. ఆ చీర కట్టుకుని, నువ్వా కారులో పక్కనే కూచున్నా, పోలిక తెలియలేదంటే నమ్ము!"

"కారా?—మీకేమన్నా కలవచ్చిందా యేమిటి ఖర్మం?"

"కర్మమేమిటి? నాలుగో ఝాము కల వూరికే పోదంటారు!-అంబారీయేనుగలాగ ఎంత హుందాగా వుందనుకున్నావా కారు? నల్లగా నిగనిగలాడిపోతూ వుంది!...లోపలే రేడియో... మెత్తటి పట్టుపరుపులు! ...గాలిమీద తేలినట్టుందేగాని, ఎక్కడా కూచున్నట్టేలేదు అంతసేపూను!—" అని కలలో పట్టిన కారు యోగం వివరంగా వర్ణించి చెప్పాడు. అంతా విని పక్కున నవ్వేసింది పార్వతి.

"ఎందుకా వెర్రినవ్వు? ఏమో, నాకూ కారెక్కే యోగంవుందేమో ఎవడు చూడొచ్చాడు?"

"నాకా వెర్రి, మీకా!......మన చూపుమేర దూరంలోవున్నవాళ్ళకైనా అట్లాంటి యోగం కనిపించ దెక్కడాను!...ఏమిటో, వుట్టి కెగరలేనమ్మ స్వర్గాని కెగరబోయిందనీ- చంటిపిల్లవంటిని చిదరం బంగారం పెట్టలేకపోయారు...కుర్ర వెధవ లిద్దరికీ స్కూలుజీతాలు ప్రతినెలా 'ఫైను'లతో గాని కట్టడం పడటంలేదు...ఆఖరికి, వున్న నాలుగు చీరెలూ చిరుగిట్టాయంటే, యిదుగో అదుగో అని యిప్పటికి మూడునెలలనించి జరుపుతున్నారు. అటువంటిది—"

"అంతేలే, ఎంతసేపూ నీ గొడవా నీ పిల్లల గొడవాను, అక్కడికి నేనేదో మహా అనుభవించేస్తు

న్నట్టు!......బస్సుకి డబ్బు పొయ్యలేక, రోజూ పన్నెండుమైళ్ళు సైకిలుమీద ఏడుస్తుంటే అక్కర లేదు...రెండోకోటయినా లేకుండా—"

"అందుకే, ఎక్కడున్నావే గొంగళీ అంటే, వేసినచోటనే కంబళీఅని వూరుకోక, యీ పిచ్చిపిచ్చి వూహాలు దేనికంట!... పెద్దకారుట!...నాకు బనారసు పట్టుచీరట!...అంతే లెండి, అటువంటివన్నీ, కలలో చూసి సంతోషించాల్సిందే యీ జన్మకింక!"

"అదుగో, ఆమాటే అనవద్దన్నాను! అదృష్టం మారితే ఎంతసేపు కావాలి వెర్రిదానా? వెధవ కారెక్కడం ఒక బ్రహ్మాండమా?—మనకీ మంచిరోజు లొస్తున్నాయి. అందుకు సూచనగానే—"

"యీ నాలుగో ఝాముకల!...బాగుందివరస! పగలు రోజూ కంటున్న కలేగా, యివేళ రాత్రి కూడా వచ్చినట్టుంది!......'కారెక్కాలి, కారెక్కాలి' అని కలవరిస్తుంటే కలేనా రావద్దూ ఖర్మం!"

"అదికాదే, వచ్చేనెలే నా 'యింక్రిమెంటు' కూడా—"

"అయిదు రూపాయలు! దాంతో మీకో కారూ, నాకో పట్టుచీరా, దుకాణంవాడి బాకీ యాభయ్యీ—"

"చాల్లే వూరుకో! ఎడ్డెం అంటే తెడ్డెం అంటూ దిగనార్చడంతప్ప, ఎప్పుడుమాత్రం మహా భాగన్నావు నామాటకి? అందుకే యిల్లా నీళ్లు గారిపోతోంది బ్రతుకు! — అయినా, ఆడదానితో యిల్లాంటి వ్యవహారాలు చెప్పడం నాదే బుద్ధి పొరబాటు—!"

"పోనీ, యింతోటి మహావ్యవహారాలూ నాతో కాకపోతే, వున్నాడుగా మీకు తగ్గట్టే ఆ సింగుగాడు—వాడు కొనుక్కోలేని సైకిలూ, మీకు కలలొచ్చే కారూగురించి, యిద్దరూ గంటలతరబడి కబుర్లు చెప్పుకోవచ్చు" అంటూనే అవతల పాలవాడికేక విని తలుపు తియ్యడానికి వెళ్ళిపోయింది పార్వతి—

గురునాధానికి మనస్సు చివుక్కుమంది. 'అయినా, గుమాస్తాగాడికి కలలేమిటు'నిపించింది. ఇంతకీ, వెంటనే కారుకొంటానని తానెన్నడూ అనుకోలేదు — ఎవ్వరితోటీ అనాలేదు. అసలు, ఏమనుకోడానికీ యెడితెరిపి యేదీ బ్రతుక్కి? ప్రతి రోజూ, వుదయాస్తమానాలు, యింట్లో పప్పులేదనో, పాలవాడు మళ్ళీ వచ్చాడనో, సంసార జంఝాటంతోనే సరిపాయె! ఆఫీసులో అడుగుపెడితే, 'ఫైళ్లూ', పైవాడి కేకలూ, తోటివాళ్ళ గుసగుసలూ, — అదో మాలోకం! — ఎటొచ్చీ, యింటినించి ఆఫీసుకీ, ఆఫీసుబయటబడి యింటికీ, యీదురోమని సైకిలు తొక్కుకొస్తున్న కాస్సేపే మనస్సుకి కొంత ఖాళీ! ...అందులోనూ, వుదయంపూటయితే, రాజధాని కొత్తఢిల్లీ, 'దఫ్తరు'కి వెళ్ళే రహదార్లనిండా, ఓ, అవి సైకిళ్లు కావు!— కాళ్లు కావు!— కార్లు కావు!... వేలకువేలు సైకిళ్ళు, వొంటరిగా, జంటలుగా, రోడ్డు పక్కలమ్మట, పొంగిన సైకుకాలవల్లాగ యేకప్రవాహమే!...ఏ ప్రపంచ యుద్ధమో అప్పుడే ముగిసి, పటాలాలు సైకిళ్లమీద పరుగెత్తుకొస్తున్నట్టువుంటుంది ...వాటిపక్కనే, యింకా బాగా దుమ్ముపడ్డరోడ్డు అంచులని పట్టుకొని, చీమలబారులలాగ, పదాతి దళాలు-'చప్రాసీ'లనబడే బంట్రోతులు!.. ఆ మహాసముద్రంమధ్యపడి సైకిలుమీద పోతూవుంటే ఏవేవో వూహాలు వుప్పెనలాగ పొంగిపోయేవి అతని మనస్సులో—కనీసం వొక మోటారుసైకిలయినాఅయితే, యింత అవిధి వుండదనిపించేది......కాని, వెధవ మోటారుసైకిలు, యెప్పుడైనా కులాసాగా భార్యనీ పిల్లలనీ ఏ షికారుకో, సినీమాకో తీసుకుపోవాలంటే వీలుండదు ... కారే వుండాలి ... చిన్నకారు ... 'సెకెండుహాండు'దయితే, మూడు నాలుగువేలల్లో రావచ్చు...అయితే, దానికి రోజూ ఏ మరమ్మత్తో, త్రోవమధ్య తొయ్యడమో — హాయికంటె అవిధే యెక్కువ ... ఉంటే, శుభ్రమైనది ఓ కొత్తకారే వుండాలి!...పదివేలు!...పన్నెండువేలు! — దాని ముండా మొయ్యా, వల్లమాలిన ఖరీదులుగదా!... ఇంతలో సైకిలు వెనకచక్రం గరగరమనేది. దిగి, 'మడ్ గార్డు' మళ్ళీ తాడుపెట్టి కట్టుకుంటూ, వచ్చే నెలజీతం రాగానే మొట్టమొదట తప్పకుండా సైకిలు మరమ్మత్తు చేయించాలని (నాలుగు నెలలలోనూ నలభయ్యోసారిగా) గట్టి నిశ్చయం చేసుకుంటూ బయలుదేరేవాడు...మధ్యని హంసపాదు లేకుండా వుంటే, తన 'స్కేలు' పరమావధి రెండువందల యిరవై రూపాయలూ చేరుకోడానికి, యిరవై రెండు సంవత్సరాలు పడుతుంది. ఆ వుద్యోగం అయినా, యిప్పటికి యేడేళ్ళనించి చేస్తూవుంటే, యెప్పుడు పీకేస్తారోననేభయమేనాయె! ... ఆ, తనకి భయమేమిటి? మొన్ననే 'అసిసెంటు' పరీక్షకి కూర్చున్నాడు... 'అసిస్టెంటు సెక్రెటరీ'వరకూ అదును దొరికినప్పుడల్లా

సలాములు కొడుతూనే వున్నాడాయె! ... 'సూపరెంటు' సిఫార్సు చేశాననే చెప్పాడు కూడా ... ఆ మెట్టుదాటితే, బండి పట్టాలమీద పడ్డట్టే!... నిజమే, 'అసిస్టెంటు సూపరెంటు'న్నా అవాలంటే, కనీసం నలభైముగ్గురు పైవాళ్లు 'హరీ' మనడమో, మరోరకంగా తప్పుకోడమో జరగాలి! ఏమో, ఒక్క కొరియా యుద్ధంలోనే వేనకువేలు చావటం లేదూ? ...ఈమధ్య, యేజబ్బూ లేకుండానే, యెంతమందో గమ్మున అవులించేస్తున్నారు! ... ఛీ, ఛీ, వాళ్ళు వీళ్ళూ చావడం దేనికి తన 'ప్రమోషను' కోసం?... తన అదృష్టమే తన్నుకొడుతుంది పైకి...మరో నాలుగయిదేళ్లు యీకష్టం...నాలుగైదువందలన్నా వస్తూ వుంటే యీ దరిద్రం వుండదు...ఒక చిన్నకారూ తీసుకోవచ్చు ఎల్లాగో—అని వచ్చేకారూ, పోయే కారూ పరకాయించేవాడు మళ్లీ...కార్లనిగురించి, సింగుగాడిదగ్గర నేర్చుకున్న సంగతులు నెమరుకొచ్చి, ఒకొక్కదాని బాగోగులూ, ధరవరలూ, అంచనాలు వేసుకునేవాడు...అందులో ఒకొక్కకారు చూస్తే, "ఆహా, అందులోపోతే ఎంతబావుంటుంది?" అని మురిసిపోయేవాడు...అంతలో ఆఫీసో, యిల్లో, వచ్చేసేది—తానింకా గుమాస్తామాత్రుడేనన్న సంగతి పునశ్చరణయి, మామూలు తాపత్రయంలో నిమగ్నుడయేవాడు......

కారెక్కాలనుకోడం తీరని కోరికని అతనికి తెలియక పోలేదు. అయితేమాత్రం అనుకోడానికి కూడా హక్కులేదూ? ఇదివర కెన్నిసారులో, భార్యతో యే ప్రమోషను గొడవో చర్చిస్తూ, "అయినా, యీ వెధవవూళ్ళో కారులేనివాడి బ్రతుకు కానీకి కొరగాద"ని ఆఖరి కోమాట విసురుతూనే వుండేవాడు. ఆమాట వినిపించుకోనట్టే, పార్వతి మాత్రం, చంటిపిల్ల మెడలోకి గొలుసుగురించో, తనకో పట్టుచీరగురించో, మరోసారి ముక్తాయి వేస్తూ వుండేదేగాని, యింత యీసడింపుగా యెప్పుడూ యెత్తిపొడవలేదు...ఆమాటకొస్తే ఆ సింగుగాడు—రతన్‌సింగు—వాడే నయం!... ఆఫీసులో బంట్రోతయితేనేంగాక, వెనక సైన్యంలో మోటారుడ్రైవరుగా పనిచేసిన అనుభవం పురస్కరించుకుని, సరదాగా కార్ల భోగట్టాలు చెబుతూ వుంటాడు... పాపం, కడుపుడుపిల్లలు వాడికీని!...రోజూ ఆఫీసుకి కాళ్ళీడ్చుకుంటూ నడిచిపోలేక, ఒక్క సైకిలు వుంటే బాగుండునని ఆశ! ఒకసారి, ఆఫీసులో సైకిలుకని అప్పు తీసుకుని, ఆ డబ్బు కాస్తా, పెళ్లానికి పురుడొచ్చి ప్రాణంమీదకొస్తే డాక్టర్లక్రింద వాడేశాడు. ఇల్లు దగ్గరగానే వుండడంవల్ల, సాయంకాలంపూటవచ్చి యేమన్నా చిల్లరపనులుంటే చేసిపెడుతూ వుండేవాడు. "నాకు కారొచ్చినప్పుడు, సైకిలు నీకిచ్చేస్తానులే!" అంటే, వెర్రిముండావాడు, అప్పుడే తొక్కుకుపోతున్నట్టే సంబరపడేవాడు! కాస్సేపు వాడితోనైనా కులాసాగా వుండట మేమిటనే నా పార్వతి అక్కుస్సు?...

గురునాథానికి భార్యమీద కోపమే వచ్చింది. ఉదయం అంతా ఏదో వంకని ఆవిడపైన చిరాకుపడుతూనే వున్నాడు. ఎంత తోసేసినా, కలొచ్చిన కారు మాత్రం అతని కళ్లముందు పరుగెత్తటం మానలేదు. దొడ్లోకి వెడుతూ, మామూలు మోతాదు ఒక్క సిగరెట్టుకీ బదులు మూడుదాకా తగలబెట్టాడు. స్నానంచేసి, తువ్వాలులో తెల్లగా వున్న భాగం వెతుక్కోకుండానే తుడిచేసుకున్నాడు. పప్పులో వుప్పులేని సంగతి పెద్దకుర్రవాడు చెప్పేవరకూ అతనికి రుచే తెలియలేదు. పంట్లాము బొత్తాలస్థానే పిన్నులకోసం వెతుక్కుని, చిరుగు కనిపించకుండా 'షైటు' సర్దుకుని, తీరా మోసి సైకిలు సమీపించేసరికి, వెనకచక్రంలో గాలి నిండుకునివుంది!...అప్పటికే ఆలశ్యం అయిపోయిందని సైకిలుమీద పళ్ళుకొరకబోయాడు. సరిగ్గా ఆ సమయానికే "రెండు నిముషాలుండండి—ఫలహారానికీ వాయి పకోడీలు తీసిస్తా"నని పొయ్యిదగ్గరనించి పార్వతి కేకేసింది. దాంతో, "యీ దరిద్రపు మొహానికి ఫలహారం కూడా యెందుకు? వెధవ పకోడీలు నువ్వే తినొచ్చు"నని నేలతగిలిన బాంబులాగ పేలేసి, సిద్ధంగావున్న కాఫీ ప్లాస్కుకూడా వదిలేసి, సైకి లీడ్చుకుంటూ, వెళ్ళిపోయాడు గురునాథం......

అత డన్నమాట బాణంలాగ గుచ్చుకుంది పార్వతి గుండెల్లో. అసలే, వుదయంనించీ భర్త కస్సుబుస్సు మంటూ వుండడం, ఆవిడ మనస్సు పరిపరివిధాల బాధపడింది. తయారుగావున్న కాఫీకూడా దిగబెట్టి పోయినందుకు నొచ్చుకుంది. దానికి తోడు, ఫెడేలున 'వెధవ పకోడీలు' అంటారా అని కంటతడిపెట్టుకుంది. ఎన్నివిధాలసరిపెట్టుకున్నా అదేమాట పదేపదే పైకుబికి, గుండించడం మొదలెట్టింది. అంత కోపం రావడానికి తాను చేసిన అపరాధం యేమిటో ఆవిడకి బోధపడలేదు. ఆ కలసంగతి విని తానూ కాళ్లు కడుక్కుని కూచోలేదనా? ఉన్న సంసార పరిస్థితి మళ్ళీ ఒకసారి మననం చేసినందుకా? ఏదో మంచీ చెడ్డా, యిదివర కెన్నిసార్లు మాట్లాడుకోలేదు?.........అందుకయి వుండదా ఆగ్రహం

అంతాను...ఆ వంకని, తన పట్టుచీర సంగతి మళ్ళీ ప్రస్తావించినందుకయి వుండాలి...పాపం, ఆయన మాత్రం ఏంచేస్తారు? కొనిపెట్టాలనే వుంటుంది... ఆఫీసులో కడుతున్న 'చీటీ' యీ నెల తనకి పడితే, తప్పకుండా కొంటాననే అన్నారుకూడా!...అదీ, యివేళో రేపో తెలుస్తుందన్నారు!...ఈలోగానే, మళ్ళీ తొందరపడి వేధించడం తనదే పొరబాటు!... అయితే, అంతమాత్రానికే అంత కోపం రావాలా? అయినా, యెప్పుడూ లేనిది అంతలేసి మాటలనేస్తారా?...

రోజంతా, పార్వతి మనస్సు మనస్సులో లేదు. ఏపనీ తోచలేదు. పోనీ, గది సర్దుదామని ప్రారంభించి, సగం కాకుండానే దిగబెట్టేసింది. పొరుగింటావిడ, మామూలుగా మధ్యాన్నం పిలిస్తే వెళ్ళింది గాని, పదినిముషాలలోనే ఏదో వంకబెట్టి తిరిగి వచ్చేసింది. చంటిపిల్ల గొడవతో గంట గంటన్నర యెల్లాగో గడిచింది. కాని, ఎన్నిసార్లు వాచీ చూసినా, అయిదున్నర కాలేదు!...అయిదున్నరయితే, పిల్లలొస్తారు స్కూలునించి. ఇంకో గంట యించుమించులో ఆయనా వస్తారు...కాస్త కాఫీ యిచ్చాక, నింపాదిగా నాలుగూ అడిగెయ్యొచ్చు! ఆయన తత్వం తనకి బాగా తెలుసు...అప్పటికి ఆయనే పశ్చాత్తపపడి, లాలనగా పలకరించబోతారు. కాస్సేపు తాను మూతి బిగించుకుంటుంది...గునుస్తుంది...చివరికి అంతా హాయిగానే వుంటుంది...

ఎల్లాగో, సాయంకాలం అయింది. పిల్లలు రావడం, కాసిని పకోడీలు తిని ఆటలకుపోవడం జరిగింది. ఆపైన గంట అయింది...గంటన్నర అయింది ...పిల్లలు తిరిగొచ్చేశారు...అన్నాలు తిన్నారు... పెద్దవాడు మాత్రం, తల్లిమనస్సులో మాట అందుకుని, "నాన్న యింకా రాలేదేం, అమ్మా?" అని రెండు సార్లు అడిగాడు. "ఆఫీసులో పనివుండి వుంటుంది," అని ఒకసారీ, "ఏ మీటింగుకి వెళ్ళారో" అని యింకో సారీ సమాధానం చెప్పిందే గాని, అది ఆవిడకే సంతృప్తికరంగా లేదు. అటువంటి సందర్భం యేమున్నా వుంటుందంటే, ముందే యింటిదగ్గిర చెప్పేవాడు గురునాథం...అంతగా అనుకోని అవాంతరం యేదన్నా వస్తే ఏ రతన్‌సింగు చేతో కబురు పెట్టేవాడు...అటువంటి దివేళ, తొమ్మిది కావస్తున్నా రాకపోడం, పార్వతి కేమీ పాలుపోలేదు...

పిల్లలు నిద్దరోయారు. చంటిపిల్లకూడా యేడిచేడిచి పడుకుంది. ఇంటి పనంతా ముగించుకుని యెదురు చూస్తూ కూచుంది పార్వతి. కాలుగాలిన పిల్లిలాగ, వీధిలోకి యెన్నిసార్లు వెళ్ళిచూసిందో లెక్కలేదు... తొమ్మిదిన్నర దాటింది...పది కావస్తోంది...ఇంక వుండబట్టలేకపోయింది పార్వతి...రతన్‌సింగు యింటికెళ్ళి కనుక్కుందామని పెద్దపిల్లవాడిని లేపబోయింది. అంతలో—"బాం, బాం" మని బయట మోత! కీచుమని బ్రేకుల చప్పుడు!–గమ్మున తలుపుతీసి చూసింది పార్వతి. తన కళ్ళని తానే నమ్మలేకపోయింది. బొమ్మలాగ గుమ్మందగ్గరే నిలబడి పోయింది!

కలకాదు...నిజమే! పెద్దకారు!...నల్లగా నిగనిగలాడిపోతోంది...లోపల వేసివున్న 'లైటు' కాంతిలో పట్టుపరుపులు తళతళలాడుతున్నాయి...

రేడియో మెల్లగా పాడుతోంది. అందులోనించే దిగుతున్నాడు భర్త!...

"నమస్తే" అంటూ లోపలమనిషి అందిచ్చిన కాగితం సంచీ పట్టుకున్నాడు...

మెల్లిగా వరండా మెట్లెక్కి వస్తున్నాడు... కారు అల్లాగే నిలిచివుంది—

చరచర రెండడుగులు ముందుకెళ్ళింది పార్వతి–

"ఇదేమిటండీ?—సరిగ్గా మీరు చెప్పిన కల–"

"అవునదే, యిల్లా నిజమయింది—" అని నవ్వుతూ కాగితం సంచీ అందిచ్చాడు గురునాథం.

అవతల, కారు బయలుదేరింది. ఓనకమూపులు చూస్తూనే పార్వతి భర్త ననుసరించింది గదిలోకి. అప్పుడు చేతిలోవున్న సంచీ గుర్తుకొచ్చి తీసి చూసింది— నెమిలి పింఛం రంగూ, జరీపోచలూను! మడత మడతకీ వెన్నెల మిసమిసలాడడమే తరవాయి!—

"నిజంగా — బనారసు — పట్టుచీరే!—ఏమిటండీ, యిదంతా...?"

"ఇందాకటిది నిజమయిన కల — ఇది కల అయిన నిజం!—ఆఫీసులో యివేళ చీటీ మనకి పడుతుందనే, పొద్దున్న అలా కలలో కనిపించింది! కాని, యీ చీర కట్టుకున్న అమ్మాయికూడా ఆ కారులో వుంటే తీరిపోయేది!—"

"చాల్లెద్దురూ, మీ హాస్యాలూ మీరూను! అసలీ కారేమిటో, గొడవేమిటో చెప్పకుండా—"

"చెప్పకేం?—కాని, యిది కలేనని మాత్రం యీసడించుకోకుండా వుండాలి? ఒక గంట ముందరే

ఆఫీసునించి సెలవు తీసుకుని, చీర కొనుక్కుని వస్తుంటే, కలొచ్చిన కారూ ఎదురుపడింది తోవలో. కాని, అక్కడే పదిగజాల దూరంలో రతన్‌సింగూ కనపడడం విచిత్రమే!...కల సంగతి తర్వాత చెప్పినా, కారు మాత్రం అదేనని చూపించాలని కేకేశాను, నేనిటూ, వాడటూ, ఆ సైకిళ్ళ సముద్రానికి అడ్డం పడబోయాం...గమ్మున కారు వేగం అందుకుంది...కారు గుద్దుకుని సైకిలు, సైకిలు కడ్డంగా సింగూ, పడిపోయారు. కొస్తలో ప్రమాదం తప్పి, నేను, పక్కనేవున్న కంకరగుట్టమీద పడ్డాను. కారు ఆసామీ మంచివాడు కాబట్టి కొద్ది గాయాలతో ఆ కారులోనే ఆసుపత్రి కెళ్ళొచ్చాను నేను! పాపం, రతన్‌సింగుమాత్రం, కాలిమీద కాస్త మోపుగా దెబ్బతగలడంవల్ల, యింకో నాలుగురోజులు ఆసుపత్రిలోనే వుండాలన్నారు. అంతటితో ఆ కల కంచికీ, మనం యింటికి" అంటూ చొక్కా కిప్పాడు గురునాథం.

"అమ్మో! ఏ యెముకన్నా విరగలేదు గదా? అయినా, ఆ వెధవ సైకిలెక్కకండింక!" అంది పార్వతి అతని చేతులమీద కట్లు నిమురుతూ.

"ఎక్కాలనుకున్నా ముప్ఫయి నలభై రూపాయలుంటేగాని, మళ్ళీ నడిచేస్థితిలో లేదులే సైకిలు!— అంటే కొన్నాళ్ళవరకూ మనకి బస్సుయోగం అన్న మాట! చెప్పానుగదూ, మనకీ రోజులు మారుతున్నాయనీ—"

అంటూ భార్యతోపాటు పట్టుచీరపరిశీలనకి దిగాడు గురునాథం.

రతన్‌సింగుమాత్రం యిప్పటికీ నడిచేపోతూ వుంటాడు ఆఫీసుకి.